క్లుప్తంగా

మహా మునీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మహామునీశ్వరుడు

నగరి: మున్సిపల్ పరిధిలోని కేశింమిట్ట వేల్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మహామునీశ్వర ఆలయంలో మండల పూజల్లో భాగంగా ఆదివారం మహామునీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మునీశ్వరుని ప్రత్యేకంగా అలంకరించగా భక్తులను ఆకట్టుకుంది. వేద మంత్రోశ్చరణల నడుమ మండల పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఈ పూజలకు ఉభయదారులుగా వ్యవహరించి పలువురికి అన్నదానం చేశారు.

పాముకాటుకు మహిళ మృతి



లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు: మండల పరిధిలోని తిరుమల కుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపియాదవ్ తల్లి లక్ష్మమ్మ ఆదివారం ఉదయం పాముకాటుకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

దొరస్వామి సేవలు ఎనలేనివి



దొరస్వామి దంపతులను సన్మానిస్తున్న టీచర్లు

పాలసముద్రం: మండల పరిధిలోని బలిజకండ్రిగ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు యస్.దొరస్వామి విద్యాభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని డీఈఓ దేవరాజ్, ఎస్టీయూ నాయకులు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలుగు ఉపాధ్యాయుడు యస్.దొరస్వామి పదవీ విరమణ వేడుక వైభవంగా జరిగింది. డీఈఓ దేవరాజులు మాట్లాడుతూ తెలుగు ఉపాధ్యాయులు 41 ఏళ్లుగా టీచర్ వృత్తినే దైవంగా భావించి విధులు నిర్వహించారు. ఆయన వద్ద విద్య నేర్చుకున్న విద్యార్థులు చాలామంది ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. దొరస్వామి విద్యాభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం దొరస్వామి దంపతులను ఉపాధ్యాయుల బృందం దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రఘు, టీచర్లు రమేష్, గోవర్ధన్, ప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సప్తగిరి సంగీత సప్తాహం



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సహకారంతో మనోవికాస్ నిర్వాహకుడు, మృదంగ విద్వాంసుడు పున్నమరాజు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తగిరి సంగీత సప్తాహం ఆదివారంతో ఘనంగా ముగిసింది. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వారం రోజులపాటు నిర్విరామంగా సాగిన ఈ కార్యక్రమ ముగింపు వేడుక ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో చేపట్టిన ఈ సప్తగిరి సంగీత సప్తాహం కార్యక్రమం ఏడు రాత్రులు, ఏడు పగళ్లు 168 గంటలపాటు నిర్విరామంగా సాగింది. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రీయ సంగీత, సంప్రదాయ నామసంకీర్తనలు, హరికథా గానం, పురంధరదాసాది కన్నడ వాగ్గేయకారుల కీర్తనల గానం, భద్రాచల రామదాస, అపురూప వాగ్గేయకారుల కీర్తనలు, కృతుల గానం, అన్నమాచార్య సంకీర్తనల విభావరి, అన్నమాచార్య భక్తి భావ స్వర తరంగాలతో ఈ సప్తగిరి సంగీత సప్తాహం సాగింది. కార్యక్రమంలో 600 మంది కళాకారులు పాల్గొని తమ దైన శైలిలో అద్భుత రీతిలో ప్రదర్శనలు అందించారు. కళాకారులను నిర్వాహకుడు మురళీకృష్ణ, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి మల్లారపు నాగార్జున శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. వారం రోజుల సప్తగిరి సంగీత సప్తాహ విజయవంతానికి సహకరించిన కళాకారులకు, వాయిద్య కారులకు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా..

- గ్రామీణ ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల శుభ్రతకు చర్యలు
- ఈ నెల 30 వరకు తాగునీరు కలుషితం కాకుండా స్పెషల్ డ్రైవ్
- నియోజకవర్గంలో 376 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు
- ఇప్పటికే 86 ట్యాంకులను శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది





మంచినీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు, ఆలత్తూరులో మంచినీటి ట్యాంకు

కార్వేటినగరం: గ్రామీణులకు స్వచ్ఛమైన రక్షిత తాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితం కాకుండా అవసరమైన జాగ్రత్తలు మొదలు పెట్టారు. ముఖ్యంగా గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసేందుకు ప్రణాళిక రూపొందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్‌హెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్‌లకు నీటిని సరఫరా చేసే మంచి నీటి పైపులు లీకై నీరు కలుషితం అవుతోంది. ఇలా లీకయ్యే పైపులను సకాలంలో గుర్తించక పోవడం, వాటి నుంచి సరఫరా అయి నీటిని తాగడం వల్ల ప్రజలు వాంతులు, విరేచనాలతో రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం..

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 376 ట్యాంకులు ఉండగా అందులో ఒక్క కార్వేటినగరం మండలంలోనే మాత్రం 98 ట్యాంకులు ఉన్నాయి. ఆయా మండలాల్లో ఇప్పటికే ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో ఉన్న 86 ట్యాంకులను పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. విధిగా ప్రజలకు రక్షిత తాగునీటినే అందించాలంటూ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారు. నియోజకవర్గంలో కొన్ని మండలాల్లోని గ్రామాల్లో ట్యాంకుల వద్ద లీకేజీల వాల్వ్ అపరిశుభ్రంగా ఉంది. అలాగే లీకేజీలతో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. ఫలితంగా ఈ నీటిని తాగేందుకు ఆయా గ్రామస్తులు ఆసక్తి చూపడం లేదు. ఆ ప్రాంతాల్లో నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ట్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులపై ఆయా ట్యాంకులను ఎప్పుడు శుభ్రం పరిచిందీ తెలిపే తేదీలను పేర్కొనాలి. అయితే పలు గ్రామాల్లో ఆ బోర్డులు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి.

తాగునీటిని శుభ్రపరిచే చర్యలు ఇలా..

- ప్రతి 15 రోజులకు ఒకసారి కచ్చితంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలి. అలాగే ఆయా ట్యాంకుల వద్ద శుభ్రం చేసే తేదీ, తిరిగి శుభ్రం చేసే తేదీని పేర్కొనాలి.
- ప్రతి 20 లీటర్ల నీటికి 0.50 మిల్లీగ్రాముల క్లోరిన్ ట్యాబ్లెట్ కలపాలి. తాగునీటిని సరఫరా చేసే పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి.
- గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్, క్లోరిన్ స్టాక్ ఉంచుకోవాలి
- క్షిత మంచి నీటి ట్యాంకుల పరిసరాల్లో నీరు కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉంచాలి.
- ఆర్‌డబ్ల్యూస్ ఇంజినీరింగ్ అధికారులు తమ పరిధిలోని నీటి పథకాలను తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ముఖ్యంగా తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

పరిశుభ్రమైన నీటి సరఫరాకు చర్యలు..

గ్రామీణులకు రక్షిత మంచినీటిని అందించేందుకు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించేందుకు ఈ నెల 30 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సుమారు 86 ట్యాంకులను శుభ్రం చేయించాం. జల్‌జీవన్ మిషన్ నిధులతో పలు గ్రామాల్లో పైపులైన్లు ఏర్పాటు చేసి కలుషిత తాగునీటి సరఫరా నివారణకు చర్యలు చేపట్టాం. ఆయా ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని క్లోరినేషన్ చేయిస్తున్నాం.

–శైలజకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, కార్వేటినగరం

కన్నికలమ్మకు ప్రత్యేక పూజలు



కన్నికలమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం కట్టకింద వెలసిన కన్నికలమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టి మధ్యాహ్నం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం మాజీ సర్పంచ్ ఆండాలురవి ఉభయదారులుగా తీసుకొచ్చిన పూజసామగ్రితో అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. పుత్రసంతానం, మాంగళ్యభాగ్యం లేని మహిళలు పిండిదీపాలు వెలిగించి అమ్మవారి ఆలయం చుట్టూ తొమ్మిదిసార్లు ప్రదక్షిణ చేశారు.

శ్రీవారి సేవలో ఆండవన్ మఠం పీఠాధిపతి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ ఆశ్రమం పీఠాధిపతి వరాహ మహాదేశికన్ స్వామి దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దాతల ఔదార్యం అభినందనీయం





మాట్లాడుతున్న డీఈఓ శేఖర్, నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

పుత్తూరు: విద్యాభివృద్ధికి తమవంతు సాయం అందిస్తున్న పుత్తూరుకు చెందిన శ్రీసరస్వతీ మాతా సాంఘిక సేవా సమాజం సభ్యులు అభినందనీయులని తిరుపతి డీఈఓ వి.శేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక మెయిన్ స్కూల్‌లో సేవా సమాజం ఆధ్వర్యంలో మండల స్థాయిలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో ఉత్తీర్ణులైన పలు పాఠశాలల విద్యార్థి, విద్యార్థినులకు నగదు బహుమతులతో పాటు విద్యాసామగ్రిని అందించారు. అలాగే పలు పాఠశాలలకు చెందిన పేద విద్యార్థులు 400 మందికి విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. రామకృష్ణమరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. దాతలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఈఓ హెచ్.ప్రభాకర్‌రాజు, ఎంఈఓలు బి.తిరుమలరాజు, ఎం.బాలసుబ్రమణ్యం, సేవా సంఘ సభ్యులు ప్రసాద్, రవిశంకర్, బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబు, యుగంధర్‌రాజు, కుమారవేలు, పురుషోత్తం, వినోద్‌బాబు, అమరనాథ్, రామమోహన్, మురళీ, సుబ్రమణ్యం, శ్రీనివాసరాజు, సుబ్రమణ్యం ఆచారి, పురుషోత్తంశెట్టి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ ఘట్టం





దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకిస్తున్న జనసందోహం, దుర్యోధనుడి వేషధారితో తలపడుతున్న భీమసేనుడి పాత్రధారి

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ధర్మరాజులస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం జరిగిన గదాయుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు ఆహూతులను అలరించాయి. వేణుగోపాల నాట్యబృందానికి చెందిన కళాకారుడు మునికృష్ణ భీమసేనుడిగా, దుర్యోధనుడిగా శివయ్య కురుక్షేత్ర యుద్ధం ముగింపు సన్నివేశాన్ని రక్తి కట్టించారు. సన్నివేశంలో భాగంగా సర్వం కోల్పోయిన దుర్యోధనుడు అస్త్రసన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్తాడు. అప్పుడు భీమసేనుడు గంగలో తపస్సు చేస్తున్న దుర్యోధనున్ని బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. అనంతరం దుర్యోధనున్ని వధించే సన్నివేశాన్ని కళాకారులు రక్తి కట్టించారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి మండల పరిధిలోని, తమిళనాడు ప్రజలు భారీగా తరలివచ్చారు.

ఆకట్టుకున్న బండికుంభాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండికుంభాల కార్యక్రమం ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి స్వర్ణలతచే హరికథా కాలక్షేపం జరిగింది. సాయంత్రం బలి కూడుతో బకాసురుని వేషధారి ప్రదర్శనగా చేసి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చిత్తూరు కలెక్టరేట్: బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాలలపై లైంగిక దాడుల నిరోధక చట్టం-2012, బాలల న్యాయ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 చట్టాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలతో పాటు బాల, బాలికల్లో చైతన్యం తీసుకురావడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వసతి గృహాల వార్డెన్లు ముందుండాలని కోరారు.

జాతరకు సహకరించాలని వినతి



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న నేసనూరు గ్రామస్తులు

పుత్తూరు: మండల పరిధిలోని పంచాయతీ కేంద్రమైన నేసనూరు గ్రామంలో గంగజాతరను సజావుగా నిర్వహించడానికి రక్షణ కల్పించాలని గ్రామస్తులు ఆదివారం పోలీసులకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతరను అడ్డుకుంటామని కొందరు చెబుతుండడంతో గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించారు. గ్రామంలో పర్యటించి తగిన చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భరత నాట్యంతో అలరిస్తున్న కళాకారులు



చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. చెన్నైకు చెందిన శ్రీశంకర నాట్య విద్యాలయ కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భరత నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా గణపతి కీర్తనలు, త్యాగరాజ కీర్తనలు, పెరుమాళ్ కీర్తనలకు నాట్యం చేసి అలరించారు. చెన్నైకు చెందిన డాక్టర్ మీనాక్షి బృందం, సరస్వతి బృందం, విల్లుపురానికి చెందిన సౌమ్య సత్యరాజ్ బృందం, కోయంబత్తూరుకు చెందిన మైథిలి ముఖేష్ బృందాల కళాకారులు తరుశ్రీ, పొన్నమాదియల్, రగని, అక్షిత, పాజశ్రీ, కిరణ్యశ్రీ, నీలా, లవినా తన్సీ, ధనస్మిత, ఒరియా, రోషిత, సత్యమణితో పాటు మరో 28 కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలం.. శ్రీరాముడి రథోత్సవం





భక్తజన సందోహం మధ్య శ్రీరాముడి రథోత్సవం, సీతారామలక్ష్మణులు(ఇన్‌సెట్‌లో)

- శ్రీరామనామస్మరణతో మార్మోగిన టి.పుత్తూరు



రథోత్సవంలో కళాకారుల వాయిద్యాలు

తవణంపల్లి: మండలంలోని టి.పుత్తూరు కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తజనసందోహం నడుమ శ్రీరాముడి రథోత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు శ్రీరామ, గోవింద నామస్మరణలు చేస్తూ రథాన్ని లాగడానికి ఎగపడ్డారు. ఆలయంలో ఉదయం వేదపండితులచే సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చనలు, పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఊంజల్‌సేవను ఘనంగా నిర్వహించారు. ఉభయకర్తలు స్వామికి పట్టువస్త్రాలు, పూజాసామగ్రిని ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం..

టి.పుత్తూరు వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీరాముడి రథోత్సవం భక్తజనసందోహం నడుమ వైభవంగా సాగింది. ఉభయదారులు ఉభయదారులు స్వామికి పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం వేదపండితులచే వేదమంత్రాలు పఠనం చేస్తూ సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులు జై శ్రీరాం, గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. రథోత్సవంలో కేరళ వాయిద్యాలు, నయాండి డాన్సులు, దేవతామూర్తుల వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం చేశారు. రథోత్సవంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ స్వామిని దర్శించుకున్నారు.

నేడు అశ్వవాహన సేవ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తిరుమంజనం, పాలాభిషేకం, మధ్యాహ్నం ఉత్సవం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో అశ్వవాహన సేవ జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.